క్లుప్తంగా

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్‌ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

యూజర్‌ చార్జీల రద్దు కోరుతూ లేఖ

డాబాగార్డెన్స్‌ : జీవీఎంసీ పరిధిలో చెత్తపై యూజర్‌ చార్జీలు వెంటనే రద్దు చేయాలని సీపీఎం ఫ్లోర్‌ లీడర్‌, 78వ వార్డు కార్పొరేటర్‌ డాక్టర్‌ బి. గంగారావు నగర మేయర్‌ గొలగాని హరి వెంకటకుమారికి లేఖ రాశారు. ప్రతి ఇంటికి నెలకు రూ.120, మురికివాడల్లో రూ.60 చొప్పున యూజర్‌ చార్జీలు నిర్ణయించారని, ఈ చార్జీలను సీపీఎం కార్పొరేటర్‌గా తీవ్రంగా వ్యతిరేకించిన విషయం తెలిసిందేనన్నారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు. తక్షణం కౌన్సిల్‌ సమావేశం నిర్వహించి చెత్తపై యూజర్‌ చార్జీలు రద్దు చేస్తూ తీర్మానం చేయాలని సీపీఎం డిమాండ్‌ చేస్తుందన్నారు.

ఎక్కడ చూసినా ధనస్వామ్యమే..



ప్రధానికి పంపిన లేఖ చూపిస్తున్న ప్రొఫెసర్‌ ముత్యాలనాయుడు

డాబాగార్డెన్స్‌: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఎక్కడా కనిపించలేదని, ఎక్కడ చూసినా ధనస్వామ్యమేనని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్‌ ముర్రు ముత్యాలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. కట్టడి చేయాల్సిన వారే డబ్బులు పంపిణీ చేసి ఓటర్లకు గాలం వేయడం దారుణమన్నారు. దేశంలో ఎంతో సాధించామనే చెప్పే ప్రధాని మోదీ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇంత జరుగుతున్న చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఈ విషయానికి సంబంధించి మోదీకి పంపిన లేఖను మంగళవారం వీజేఎఫ్‌ ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు విడుదల చేశారు. ఇటీవల కాలంలో ఓటర్లకు ప్రత్యక్ష డబ్బు బదిలీలు బాగా పెరగడంతో ప్రజాస్వామ్యం తుప్పు పట్టిందన్నారు. ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థులు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు సగటున రూ.50 కోట్లు ఖర్చు చేశారని, ప్రతి ఓటరుకు సగటున రూ.1, 500 నగదు ఇచ్చారని ఆరోపించారు. ఒక్క రాష్ట్రంలోనే సుమారు 3 కోట్ల మంది ఓటర్లకు ఇలా నగదు అందజేశారని, దీన్ని బట్టి దేశంలో ఏ మేరకు నగదు పంపిణీ చేశారో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎన్నికల్లో సంస్కరణలు తీసుకురావాలని మోదీకి పంపిన లేఖలో విజ్ఞప్తి చేశారు.

మస్తానప్పకు సత్కారం

ఉక్కునగరం : స్టీల్‌ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్పను మంగళవారం సత్కరించారు. ఈ నెలాఖరున ఆయన పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా స్టీల్‌ మెల్ట్‌ షాప్‌-1 విభాగం వైఎస్సార్‌టీయూసీ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విభాగాధిపతి బాలకుమార్‌, సీసీడీ ఇన్‌చార్జి కుమారస్వామి అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్లాంట్‌లో ప్రతి ఒక్కరూ అభిమానించే అతి కొద్ది మంది నాయకుల్లో మస్తానప్ప ఒకరన్నారు. మస్తానప్ప మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దరిగి రవి, బాబూరావు, ఎం. రాంబాబు, చంద్రశేఖర్‌, వర్మ, సేథి, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

విజ్ఞానం.. వినోదం

చిన్నారులు వేసవి సెలవులను ఎంజాయ్‌ చేస్తున్నారు. ఏడాది పొడవునా పాఠాలతో కుస్తీ పట్టి సెలవులు రాగానే ఆనంద డోలికల్లో మునిగి తేలుతున్నారు. తల్లిదండ్రులకు మాత్రం వారి ఉత్సాహం తలనొప్పిగా మారింది. పిల్లలు ఇంటి పట్టునే ఉండటంతో వారు చేసే అల్లరి భరించటం ఒకింత కష్టంగా ఉంది. ఒకప్పుడు వేసవి సెలవులు వస్తే పల్లెటూళ్లలోని బంధువుల ఇళ్లకు పిల్లలు వెళ్లేవారు. ప్రస్తుతం పల్లెల్లో ఉన్నవారు పట్టణాలకు వచ్చేయడంతో ఆ పరిస్థితి లేదు.

- చిన్నారుల్లో జోష్‌ నింపుతున్న వేసవి శిక్షణ శిబిరాలు
- ఆటలు.. పాటలు.. స్టోరీ టెల్లింగ్‌తో సందడే సందడి
- జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ

అల్లిపురం : చిన్నారుల మెదళ్లకు పదును పెట్టేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పొచ్చు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో శాఖా గ్రంథాలయాల ద్వారా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు చిన్నారుల మనో వికాశానికి ఎంతో ఉపయోగపడుతున్నాయి. వారికి విజ్ఞానం.. వినోదం అందజేస్తున్నాయి.

మే 15 నుంచి జూన్‌ 7 వరకు..

శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలను ఈ నెల 15వ తేదీ నుంచి జూన్‌ 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాలలో చిన్నారులకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, ఆటలు, పాటలు నేర్పిస్తున్నారు. వాటిలో ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు. ఈ విధంగా చేయడం వలన ఆటపాటలతో పాటు పాఠాల పట్ల కూడా వారికి అవగాహన కలిగించవచ్చు.

పుస్తక పఠనంతో విజ్ఞానం..

గ్రంథాలయాల్లో గల చరిత్ర పుస్తకాలు, ప్రముఖల జీవిత చరిత్రలు, చారిత్రక ప్రాంతాలపై అవగాహన, పౌరాణిక గ్రంథాలతో పరిచయం, ఆధ్యాత్మిక, సామాజిక, సాంఘిక, భాషా పరిజ్ఞానం పట్ల మక్కువ పెంచగలుగుతున్నారు. ఇలా చేయటం వల్ల పిల్లల ఆలోచనా శక్తి మరింత మెరుగుపడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడతున్నారు. చిన్నారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నారు.

అల్లిపురం శాఖా గ్రంథాలయంలో..



స్టోరీ టెల్లింగ్‌ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అల్లిపురం శాఖా గ్రంథాలయంలో ఈ నెల 15 నుంచి నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో అధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొని ఆటపాటలతో సరదాగా గడుపుతున్నారు. గ్రంథాలయాధికారి పీవీ నూకరాజు చిన్నారులకు చిత్రలేఖనం, క్విజ్‌, వ్యాస రచన పోటీలతో పాటు పలు రకాల ఆటలు కూడా ఆడిస్తుండటంతో చిన్నారులు ఉత్సాహం చూపిస్తున్నారు.



వ్యాస రచన పోటీలో పాల్గొన్న చిన్నారులు



పుస్తక ప్రదర్శనలో కథల పుస్తకాలు పరిశీలిస్తున్న చిన్నారులు



క్యారమ్స్‌ ఆటలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

విజ్ఞానం పెంచుకుంటున్నాం..



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొనటం ఆనందంగా ఉంది. ఇక్కడ సుమారు 7 వేలకు పైగా పుస్తకాలున్నాయి. అవి విద్యార్థులకు ఉపయోగకరమైనవి. అన్నిటికీ మించి మెదడుకు పదును పెట్టే ఆటలు, చిత్రలేఖనం, ఎస్సే రైటింగ్‌ వంటి పోటీలతో మా పరిజ్ఞానం మెరుగుపరచుకోగలుగుతున్నాం. – ఎస్‌.తనూజ, రవీంద్రభారతి స్కూల్‌

తెలియనివి తెలుసుకుంటున్నాం..



మాకు తెలియని విషయాలు తెలుసుకుంటున్నాం. వీటిలో చాలా వరకు మా పాఠ్య పుస్తకాలలో ఉండవు. మాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వేసవి శిక్షణ శిబిరంలో ఆటలు ఆడిస్తుండటంతో చాలా బాగుంది. – కె.కావ్య, ఎంజీఎం హైస్కూల్‌

ఆటలు నచ్చాయి..



వేసవి శిక్షణ శిబిరంలో మాతో ఆడిస్తున్న క్యారమ్స్‌, చెస్‌ వంటి ఆటలు బాగున్నాయి. రోజంతా సరదాగా గడిచిపోతుంది. కొత్త స్నేహితులు పరిచయమయ్యారు. వారితో హాయిగా ఆడుకుంటున్నాను. ఈ శిబిరం నచ్చింది. – జి.ప్రేమవర్ధన్‌, విజ్ఞానభారతి స్కూల్‌

స్పందన బాగుంది..



గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలకు మంచి స్పందన వస్తోంది. పోటీల్లో పాల్గొన్న విజేతలకు జూన్‌ 7న బహుమతులు అందజేస్తాం. చిన్నారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాం. – పీవీ నూకరాజు, గ్రంథాలయాధికారి, అల్లిపురం శాఖా గ్రంథాలయం

రహదారిపై చెత్త కనిపించరాదు



రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త ఎత్తిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్‌

జగదాంబ : రహదారి పక్కన ఉండిపోయిన చెత్త కుప్పలను వెంటనే ఎత్తివేయాలని జీవీఎంసీ జోన్‌–4 ఏఎంహెచ్‌వో రాజేష్‌ అన్నారు. మంగళవారం ఆయన జోన్‌ పరిధిలోని 12 వార్డుల్లో పర్యటించారు. అధికారులు, సెక్రటరీలు, సిబ్బందితో మాట్లాడుతూ వన్‌టౌన్‌ రహదారి విస్తరణలో భాగంగా చెత్త పేరుకుపోయే అవకాశం ఉందన్నారు. దాన్ని తొలగించి పరిసరాలు పరిశుభ్రం చేయాలన్నారు. జగదాంబ, బీచ్‌రోడ్డు, పూర్ణామార్కెట్‌, వన్‌టౌన్‌ వంటి ప్రాంతాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా కనబడేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త మరీ ఎక్కువగా ఉంటే ఆయా ప్రాంతాల్లో అదనపు వాహనాలు పెట్టి చెత్త డంపింగ్‌ యార్డుకు తరలించాలన్నారు. సెక్రటరీలు పారిశుధ్య సిబ్బందితో పనులు చేయించి ఆ వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలి..

పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలని జోన్‌–4 ఏఎంహెచ్‌వో రాజేష్‌ అన్నారు. మంగళవారం జోన్‌–4 కార్యాలయంలో పారిశుధ్య సిబ్బంది, సెక్రటరీలతో సమావేశం అయ్యారు. కార్పొరేషన్‌ నియమం ప్రకారం ప్రతి వాహనానికి 650 కేజీల చెత్త డంపింగ్‌ యార్డుకు తరలించాలన్నారు. చెత్త పన్ను వసూలు చేయలన్నారు.

ప్లాస్టిక్‌ నివారణకు చర్యలు..

జీవీఎంసీ కమిషనర్‌ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు ప్లాస్టిక్‌ నిర్మూలకు అంతా కలిసి పని చేయాలన్నారు. హోల్‌సేల్‌ దుకాణాల్లో ప్లాస్టిక్‌ అమ్మకాలు జరగకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. హోటళ్లు, చిరు వ్యాపారుల వద్ద కచ్చితంగా తనిఖీలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్‌ కిశోర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల ఉత్సవాలు

బంగారమ్మ, పోలమాంబకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు



పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ



గొల్లలపాలెం గ్రామదేవత పోలమాంబ

డాబాగార్డెన్స్‌ : జీవీఎంసీ 28వ వార్డులో వెలసిన బంగారమ్మ, పోలమాంబ, 31వ వార్డు కృష్ణాగార్డెన్స్‌లో వెలసిన దుర్గాలమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయాలను విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

బంగారమ్మ పండగ..

ఈ నెల 19న ప్రారంభమైన పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ జాతర మహోత్సవాలు మంగళవారం అనుపు మహోత్సవంతో ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పండగ చాటింపు, సోమవారం తొలేళ్ల ఉత్సవం, 21న ప్రధాన పండగ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో గరిడీలు, పులివేషాలు, తప్పిటగుళ్ల వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పితానిదిబ్బ, గొల్లలపాలెం, ప్రకాశరావుపేట, దిబ్బలపాలెం, భానోజీనగర్‌, కన్నయ్యపేట, విశ్వనాథం రోడ్డు, సింగ్‌ హోటల్‌ జంక్షన్‌ తదితర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పోలమాంబ పండగ..

గొల్లలపాలెం గ్రామ ప్రజల ఆరాధ్యదైవం పోలమాంబ జాతర మహోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చాటింపు జరిపారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అనుపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గొల్లలపాలెం, శెట్టిబలిజ సంఘం, బుద్ధలవానిపాలెం, రామ్‌నగర్‌, నెహ్రూనగర్‌, ఆది ఆంధ్ర గ్రామం, అశోక్‌నగర్‌, మున్సిపల్‌ కార్పొరేషన్‌ ప్రాంత వాసులు పోలమాంబను ఆరాధిస్తుంటారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని సదునుపట్టు (ఆర్టీ క్లబ్‌ గొల్లలపాలెం) నుంచి ధూప దీప నైవేద్యాలు, బాజా భజంత్రీలు, తప్పిటగుళ్లు, చెక్కభజన, పులివేషాలు, సాము గరిడీలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. 28న మారువారం జరపనున్నారు. ఉత్సవంలో భాగంగా వచ్చే నెల 9న ఆలయ ప్రాంగణం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పోలమాంబ అమ్మవారి ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

చురుగ్గా డెయిరీ ఫారం బస్‌ బే నిర్మాణం



జాతీయ రహదారి పక్కన ఇందిరానగర్‌ వద్ద నిర్మాణంలో ఉన్న బస్‌ బే

ఆరిలోవ: నగరంలో జీవీఎంసీ అధికారులు కొన్నాళ్లుగా బస్‌బేలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల బస్‌బేలు అందుబాటులోకి వచ్చాయి. ప్రయాణికులకు సౌకర్యవంతంగా అత్యాధునికంగా నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో భాగంగా జాతీయ రహదారి పక్కన పాత డెయిరీ ఫారంలో ఇందిరానగర్‌ వద్ద తలపెట్టిన బస్‌బే నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఇంత వరకు ఇక్కడ బస్‌ షెల్టర్‌ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడేవారు. ప్రస్తుతం చేపడుతున్న బస్‌బేతో ప్రయాణికుల సమస్య తీరనుంది. ఈ బస్‌బే అందుబాటులోకి వస్తే ఇందిరానగర్‌ వాసులతో పాటు రూరల్‌ తహసీల్దారు కార్యాలయం, జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వెళ్లే వారికి ఉపయోగపడుతుంది. అంతే కాకుండా శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లే సర్వీసు బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులకు కూడా ఉపయోగకరంగా ఉండనుంది. కొద్ది రోజుల్లో ఈ బస్‌ బే అందుబాటులోకి రానుంది. దీంతో స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంస్కరణవాది రాజీవ్‌గాంధీ



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రవికుమార్‌ తదితరులు

మహారాణిపేట : శ్రీ గాయత్రీ వెల్ఫేర్‌ కల్చరల్‌ యూత్‌ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్‌ ట్రస్ట్‌ సంయుక్త నిర్వహణలో మహారాణిపేట ప్రకృతి చికిత్సాలయంలో రాజీవ్‌ గాంధీ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌ చిత్రపటానికి మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్‌ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తీవ్రవాదులు జరిపిన బాంబు దాడిలో రాజీవ్‌గాంధీ మరణించారని, ఆ రోజును జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

దేశ ప్రధానిగా పిన్న వయసులో బాధ్యతలు స్వీకరించిన రాజీవ్‌గాంధీ దేశంలో ఎన్నో సంస్కరణలు చేపట్టారని అన్నారు. కంప్యూటర్‌ రంగాన్ని బలోపేతం చేసి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో కృషి చేసిన ప్రథమ వ్యక్తి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి సత్తా చాటే క్రీడాకారులకు రాజీవ్‌ ఖేల్‌ రత్న, సామాజిక సేవకులకు రాజీవ్‌ గాంధీ మానవ సేవ, శాంతి ప్రియులకు రాజీవ్‌ పీస్‌ అవార్డు ఇచ్చి దేశంలోని అత్యున్నతమైన వ్యక్తులను జాతీయస్థాయిలో గౌరవిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ ఎస్‌. లక్ష్మీనారాయణ, డాక్టర్‌ ఎస్‌. శ్రీలక్ష్మి, ఎస్‌. చాతుర్య , క్షీరాబ్ధి దుతి, డాక్టర్‌ వై. లక్ష్మణరావు, దేవర చంద్రశేఖర్‌రావు, గేదెల శ్రీహరి, ఎం ఆదినారాయణ, చరణ్‌, గౌరీ శంకర్‌, జి రాము, రమణ, మంగా, బంగారమ్మ తదితరులు పాల్గొని రాజీవ్‌ గాంధీకి ఘన నివాళులర్పించారు .

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సుర్రుమన్న సూరీడు



జనసంచారం లేని అల్లిపురం మెయిన్‌రోడ్డు

అల్లిపురం : వేసవి తాపంతో వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఇంటి నుంచి బయటికి వస్తే చాలు సూరీడు సుర్రుమంటున్నాడు. మంగళవారం ఎండ తీవ్రతకు తాళలేక ప్రజలు గొడుగులు, టోపీలను ఆశ్రయించారు. అత్యవసరమై ఇంటి నుంచి బయటికి వచ్చేవారు తగిన జాగ్రత్తలు తీసుకుని వస్తున్నారు. ఎండ వేడిమికి తట్టుకోలేక కొబ్బరి బొండాలు, శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో కూల్‌డ్రింక్స్‌, పళ్ల రసాలు అమ్మే దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. మరొక నాలుగు రోజుల్లో రోహిణికార్తె ప్రారంభం కానుంది. అప్పుడు పరిస్థితి ఏమిటని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శీతల పానీయాల బండి వద్ద గుమిగూడిన వాహన చోదకులు



ఎండ వేడి తట్టుకోలేక గొడుగును ఆశ్రయించిన వ్యక్తి

అంబరాన్నంటిన సతివాడమ్మ తల్లి సంబరం



గౌరపల్లిలో అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు



సతివాడమ్మతల్లి

పెందుర్తి: గౌరపల్లిలో వెలసిన ఏడు గ్రామాల ఆరాధ్య దేవత సతివాడమ్మతల్లి పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు జరిపారు. భక్తులు పసుపు–కుంకుమలతో పూజలు చేశారు. చీరలు, ముడుపులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అగ్నిగుండాలు తొక్కారు. సాయంత్రం ఘటాల ఊరేగింపు అట్టహాసంగా సాగింది. ప్రజలు పిండి వంటలు, పలు రకాల పండ్లు నైవేద్యంగా సమర్పించారు. ఎలేనుగు సంబరం అంబరాన్ని అంటింది. ఆనవాయితీగా ఉయ్యాల కంబాల ఘట్టం నిర్వహించారు. భజనలు, డప్పుల వాయిద్యాల నడుమ అనుపోత్సవం వైభవంగా చేశారు. పగటి వేషాలతో యువకులు సందడి చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గౌరపల్లి, కోట్నివానిపాలెం, గంగమ్మపేట, గొల్లలపాలెం, కరకవానిపాలెం, గవరపాలెం, సంతపాలెం గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.



జాతరలో పాల్గొన్న ప్రజలు

సచివాలయాల్లో బీసీజీ వ్యాక్సిన్‌

మధురవాడ : ప్రతి గురువారం టీబీ నిర్మూలనకు బీసీజీ టీకాలు వేస్తారని హెల్త్‌ సూపర్‌వైజర్‌ వీర బ్రహ్మం సూచించారు. మధురవాడ టీబీ యూనిట్‌ పరిధిలోని మధురవాడ, ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు సాగర్‌నగర్‌, రుషికొండ, పీఎంపాలెం, వాంబేకాలనీ, స్వతంత్రనగర్‌ తదితర 10 యూపీహెచ్‌సీల పరిధిలో వ్యాక్సిన్‌ వేస్తారన్నారు.